
# దేశభక్తి! జిందాబాద్!

డా॥ శాంతికుమార్



సుబ్బారావు ఉరఫ్ రే...త్‌కు ఈమధ్యనే పెళ్ళైంది. అత్త మా..లు ఆస్తిపరులు కాకపోయినా ఒక్కతే కూతురు కావటంచేత, అల్లుడి మర్యాదలు ఘనంగానే జరుగుతున్నా యతనికి. హనీమూన్ పంపేందుకు మామగారు సిద్ధపడటం అతనికి కోరకుండా తీరుతున్న కోరిక.

హనీమూన్‌కి కనీసం పది రోజులు సెలవు కావాలి. పెళ్ళికాని నరకాసురుడి లాంటి ఆఫీసర్‌కి సదరు సరదాలు తెలియకపోవటం చేత, సుబ్బారావుకి సెలవు శాంక్షన్ చెయ్యకుండా తిప్పలు పెడుతున్నాడు.

'మెటర్నిటీ లీవ్ లాగా హనీమూన్ సెలవు కూడా చట్టబద్ధమైన హక్కుగా చెయ్యమని ఎందుకు పోరాడకూడదు - అనిపించింది సుబ్బారావుకి. ఆఫీసర్ని బ్రతిమాలి, భంగపడి ఎలాగైతేనేం? సెలవు సాధించాడు.

పది రోజులు. ఫైళ్ళు, నరకాసురుడికి 'మాణింగ్'లూ, 'సారీ'ల నుంచి విముక్తి లభించటంతో పాటు, తన హృదయేశ్వరితో పానకంలో పుడకల న్యూసెన్స్ లేకుండా గడపనున్న అనుభూతి ఊహలతో అతని మనస్సు దూదిపింజలా తేలిపోతోంది.

రైల్వే స్టేషన్లో మామగారు ఎన్నెన్నో జాగ్రత్తలు చెప్తూ-

''గంగానదిలో స్నానం చెయ్యాలన్న కోరిక నా కెటూ తీరలేదు. మీరైనా ఆ పవిత్ర నదిలో స్నానం చెయ్యండి. హరిద్వార్ నుంచి గంగాజలం తేవటం మాత్రం మరిచిపోవచ్చు'' అని మరీ మరీ చెప్పారు.

తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కారు సుబ్బారావు దంపతులు.

ట్రెయిన్ బయలుదేరాక, పక్కనే వేగంగా నడుస్తూ - ''అమ్మా ! సుబ్బా ! జాగ్రత్త ! గంగాజలం మాత్రం...'' రైలు వేగం పుంజుకోవటంతో మిగతా మాటలు వినిపించకపోయినా, వినిపించిన కొద్ది మాటలకే ఒళ్ళుమండింది సుబ్బారావుకి.

''నాన్సెన్స్ ! సుబ్బా... ఏమిటి?'' అనుకుంటూ. అంత అందమైన తన పెళ్ళానికి సుబ్బలక్ష్మి అని పేరు పెట్టిన మామగారి అగ్లీ టేస్ట్‌ని తెగ తిట్టుకున్నాడు. కిటికీలోంచీ వెనక్కి పరిగెడుతున్న చెట్లని చూస్తూ ఆనందిస్తున్న కుసుమకోమలమైన ఆమెని... తాకితే కందిపోయేంత మంజులంగా ఉన్న ఆమెని... ఆమె మొహంపైన నాట్యం చేస్తున్న ముంగురుల్ని ఈర్ష్యగా చూస్తూ మనసులోనే సీరియస్‌గా అనుకున్నాడు - ''ఈ పేరు మార్చితీరాలి'' అని.

ఢిల్లీలో హొటల్ సదరన్‌లో దిగా రిద్దరూ. అది తెలుగు వారిదన్న అభిమానంతో పాటు, చదువుకునే రోజుల్లో హిందీ ఏమాత్రం జీర్ణం కాకపోవటం కూడా అందు క్కారణం. ఓ రోజు పూర్తిగా కొత్త దంపతుల బైపు విశ్రాంతితో గడిపి, మర్నాడు హరిద్వార్ బయలుదేరారు టూరిస్టు బస్‌లో.

పవిత్ర గంగానదీమతల్లి మైదానప్రాంతంలో అడుగు పెట్టిన ప్రదేశం హరిద్వార్.

''కొండలను దాచేసిన పచ్చని చెట్లూ, వాటిపైన దట్టంగా పరుచుకున్న పొగమంచూ, ఆ మంచు బిందువుల్లోనుంచీ ప్రవహిస్తున్న ఉదయ కిరణ వక్రీభవనం వెదజల్లుతున్న చిన్ని చిన్ని ఇంద్రధనుస్సులూ - ఈ ప్రకృతిలోనే రమణీయత తొణికసలాడుతోంది !'' తన సౌందర్య దృష్టిని రమ్యంగా కృష్ణశాస్త్రి కవితలా వ్యక్తం చేశాడు సుబ్బారావు.

''నాకు మాత్రం చలి వణికసలాడుతోంది.'' రెచ్చగొడుతూ కవ్వించింది సుబ్బలక్ష్మి.

''నిజమే. డిసెంబర్ చలి గడ్డకట్టించేలా ఉంది. పుణ్యం మాట మీ నా న్నెరుగు ! మంచుగడ్డలు ప్రవహిస్తున్న గంగానదిలో ఈ చలిలో స్నానం చెయ్యనుగాక చెయ్యను.''

యాత్రికుల సమూహం ముందుకు సాగుతోంది.

కదులుతున్న లక్ష్మణ ఝూలా పైన నడుస్తుంటే సుబ్బలక్ష్మి భయంతో తనను కరుచుకుపోయినప్పుడు ఆ అనుభూతికోసం మరింత నెమ్మదిగా అడుగులో అడుగు వేస్తూ నడిచాడు సుబ్బారావు.

''డియర్ సుబ్బ... ఛీ ! డర్టీ ! ఏమోయ్ నిన్ను 'మంజూ' అని పిలవనా?'' అన్నాడు తన కెంతో ఇష్టమైన పేరు తలుచుకుంటూ.

''అవి డెవరు? కాలేజీలో మీ గర్ల్ ఫ్రెండా?'' ఆమె ముఖం అప్పటికే ఉక్రోషంతో కందగడ్డలా ఎరుపెక్కింది.

''అది కాదు డియర్. నిన్ను ముద్దుగా రెండక్షరాలతో పిలవాలంటే 'సుబ్బా' అనాలి. డర్టీగా. అసలు నీ అందానికి 'మంజుల' చక్కటి పేరు. ఎంచక్కా 'మంజూ' అని పిలిస్తే ఉండే. మజా సుబ్బా అంటే ఉంటుందా?'' అతని కళ్ళు అరమోడ్పు లయ్యాయి పరవశంతో.

''మంజుల లెవరూ నిజంగా మీ గతంలో లేరా?'' ఆమె కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతూ... ఏ క్షణంలోనైనా చెక్కిళ్ళపైనుంచీ జారి గంగానదిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

''నిజ్జంగా లేరు. నీ మీ దొట్టు. కాలేజీలో అమ్మాయి లంత నన్ను బుద్ధావతారం అనేవాళ్ళు తెలుసా?'' బుంగమూతి పెట్టాడు.

''బుద్ధావతరమో, రామావతరమో... గంగానదిలో స్నానం చేసి ప్రమాణం చేస్తే తప్ప నే న్నమ్మను !''

''ఓయ్యస్ !'' అన్నాడు సుబ్బారావు. మంజూ అని పిలిపించుకోటాని కామె అంగీకరిస్తే ఆపళంగా వంతెన మీదినుంచే గంగలో దూకమన్నా సరేనని దూకేటంత మోజుం దతనికి ఆ పేరంటే.

గడ్డ కట్టించే చలిగంగలో సరిగంగ స్నానం

### చెప్పేవి...

'' 'ఎదుటివాడికి చెప్పేందుకే నీతులు ఉన్నాయి' - దీని కొక ఉదాహరణ చెప్పవోయ్?'' అడిగాడు రాజారావ్ రాఘవని.

'' 'కనీసం ఇంటి కో చెట్టయినా నాటండి బాబో' అని చెవి కోసిన మేకలా అరిచే ప్రభుత్వం, రోడ్డు వెడల్పు చేయడంకోసం చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికించేయడమే'' టక్కున చెప్పాడు రాఘవ.

-ఐలేని శ్రీనివాస్‌గౌడ్
[రామాయంపేట]

సుబ్బులక్ష్మికి భర్తపైన తొలి విజయం.

తరువాత రోప్ వే మీద ప్రయాణించి కొండమీద కొలువున్న మనసాదేవిని దర్శించటం, అక్కడి నుంచి సప్తర్షుల కోసం ఏడు పాయలుగా చీలిన గంగానదిని చూడటం ఓ మధురానుభూతి. ఆ సుందర దృశ్యాల నేపథ్యంతో 'జంటగా ఫోటోలు తీసుకోలేకపోయామే' అని కొండంతగా దిగులుపడిన సుబ్బారావు మనసు, కెమేరా కొని ఇచ్చి పంపని మామగారి పిసినారితనాన్ని తీవ్రంగా విమర్శించింది.

"క్యా సాబ్ ! కలర్ ఫోటో చాహియే? బీస్ రూపయేమే ఆప్ దేనేంకా కలర్ ఫోటో. అపనే అడ్రస్ దియేతో హమ్ రిజిస్టర్ పోస్టమే ఆప్‌కే తస్వీర్ భేజేంగే !" ఆ అగంతకుడు మాట్లాడుతున్న దేమిటో అర్థం కాకపోయినా, చేతులలో కెమేరాని బట్టి ఫోటోగ్రాఫర్ అని గ్రహించాడు సుబ్బారావు.

సుబ్బులక్ష్మి ఫోటో తీయించుకోవాలని సరదా పడింది.

"వాడు ఫోటోలు పంపకపోతే?"

"అబ్బ ప్రతిదానికీ అనుమానమే !" కోపంగా అం దామె.

పెళ్ళైన తరువాత కనీసం ఆర్నెల్లవరకూ పెళ్ళాందే గెలుపన్న నిజం మరోసారి రుజువైంది. వివిధ ప్రదేశాల్లో, వివిధ కోణాల్లో అయిదు ఫోటోలు తీసి, అడ్రసు రాసుకుని, వంద రూపాయలు వసూలు చేసుకుని రసీ దిచ్చి, మరో కస్టమర్‌ని వెతుక్కుంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు ఫోటోగ్రాఫర్.

మరో రోజు ఆగ్రా ప్రయాణం.

"ప్రపంచపు వింతల్లో ఒకటి, అద్వితీయ ప్రేమచిహ్నం, అమూల్య ప్రేమ కానుక... తాజ్‌మహల్ ముందు తమతో పాటు మ రెందరో సందర్శకు లుండటం చిరాకేసింది సుబ్బారావుకి. తాము పొందుతున్న ఆనందం మ రెందరో కూడా పొందుతున్నందుకు ఒకింత అసూయ కూడా కలిగింది.

"ఆ సౌందర్యాన్ని ఆస్వాదించకుండా ఎవర్ని నిరోధించగలరు? ఆ అవకాశమే ఉంటే ఇప్పటికే ఎవరో ఒకరు ఆక్రమించుకుని స్వంతం చేసుకుని మనను మాత్రం నిరోధించే వాళ్ళు కాదూ?" అన్న సుబ్బులక్ష్మి తర్కంతో ఓదార్పు పొందాడు సుబ్బారావు.

"నిజమే. కట్టించిన షాజహాన్ కనుచూపు మేరలో బందీగా ఉండి మాత్రమే చూడగలిగిన తాజ్‌మహల్‌ని మనం దగ్గరగా స్పృశించి చూడగలుగుతున్నాం. ఆ చక్రవర్తి కంటే మనమే అదృష్టవంతులం కదూ !" ఠీవిగా, అచ్చం చక్రవర్తిలా నిల్చుని అన్నాడు సుబ్బారావు. అతని 'స్టైల్లు'కి గర్వంగా చూస్తూ కళ్ళతోనే మెచ్చుకుంది మంజూబేగం !

తాజ్‌మహల్ పరిసరాల్లో ఎన్నో ఫోటోలు...

"కాలం లంత వేగంగా కరిగిపోయిందే !" అనుకున్నాడు అతను తిరుగు ప్రయాణంలో !

** ** **

పదవులూ, అధికారాలూ గట్రా లేని చాలామంది దక్షిణాది వారికి, సగటు మనుషులకి, తాజ్‌మహల్ నిర్మాణానికి రా ళ్ళెత్తిన కూలీల బంధువర్గాలకే గగనకుసుమంలా... బొమ్మల్లో తప్ప చూడటం సాధ్యంకాని అనేక ప్రదేశాలు - మామగారి డబ్బుతో - చూసిన సుబ్బారావు తన అదృష్టానికి మురిసిపోతూ, మిత్రు లందరి ముందూ చిన్న సైజు ఫోటో ఎగ్జిబిషన్ పెట్టా లనుకున్నాడు.

నెల... రెండు నెలలు...

మూడు నెలలు...

ఫోటోలు రాలేదు.

రసీదుల మీదున్న అడ్రసులకి ఉత్తరాలు రాసినా జవాబు లేదు.

నాలుగు నెలలు గడిచాయి. సుబ్బారావు ఉత్తరాల యుద్ధం జరుగుతూనే ఉంది. అసహనం పెరుగుతోంది !

పదా? పాతికా? ఆ రొందల రూపాయలు !

మళ్ళీ అంతదూరం వెళ్ళగలనా? వెళితే మాత్రం అది హనీమూన్ అవుతుందా?

ఎలాగైనా ఫోటోలు రాబట్టాలి. ఎలా?

పరిష్కారంగా తళుక్కున మెరిసిం దో ఆలోచన.

తనకు కలిగిన చేదు అనుభవాన్ని, నష్టాన్ని అసంతృప్తినీ వ్యక్తం చేస్తూ, తన భాషా చాతుర్యాన్నంతా రంగరించి ఇంగ్లీషులో రాసిన ఉత్తరం కాపీలు, ఫోటోగ్రాఫర్‌లు ఇచ్చిన రసీదుల ఫోటోస్టాట్ కాపీలతో జత చేసి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రితో సహా సంబంధిత అధికారు లందరికీ పంపించాడు రిజిస్టర్ పోస్టులో.

తన ఉత్తరంలో "...ఇలాంటి మోసం... నా సంగతి వదిలెయ్యండి. భారతీయుడిని, అర్థం చేసుకోగలను. కానీ, ఏ విదేశీయుడికో జరిగితే వాళ్ళ దేశంలో మన దేశ పరువు ప్రతిష్ఠ లేమౌతా యో ఆలోచించారా...?" అంటూ రాసిన వాక్యాలు అధికారుల్లో కదలిక తేవచ్చునని ఆశించాడు సుబ్బారావు.

నెల తరువాత-

ఒకే రోజు రెం డుత్తరా లొచ్చాయి, ఉత్తరప్రదేశ్ నుంచి మొదటి ఉత్తరం చించాడు. టైపు చేసిన పేపర్ తీసి విజయగర్వంతో చదివాడు.

"మిస్టర్ సుబ్రావ్,

ప్రతి పర్యాటక స్థలంలోనూ గుర్తింపు పొందిన ఫోటోగ్రాఫర్ల వివరాలు నోటీసు బోర్డుల ద్వారా తెలుపుతూనే ఉన్నాం. మీరు మోసపోయారని గమనించగలరు. మరోసారి జాగ్రత్త పడతారని ఆశిస్తున్నాము.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం."

రెండో ఉత్తరం తెరిచాడు.

"సుబ్రావ్‌జీ !

ఎంతో బాధ్యతారహితమైన విమర్శలతో మీరు రాసిన ఉత్తరం చూశాం.

'ఈ మోసం విదేశీ టూరిస్టులకి జరిగితే...' అన్నారు. మా రాష్ట్రానికి ఏటా కోట్లాది రూపాయల ఆదాయాన్నీ, దేశానికి మ రెన్నో కోట్ల రూపాయల విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని ఇస్తున్న విదేశ టూరిస్టుల్ని స్వంత కెమేరా లేకుండా పర్యటనలు చేసేవారుగా భావిస్తూ అవమానించారు.

టూరిస్ట్ స్పాట్‌కు స్వంత కెమేరా లేకుండా వెళ్ళే అలవాటు మన భారతీయులది మాత్రమేనని గ్రహించని మీ అజ్ఞానాన్ని గౌరవనీయులైన విదేశీ యాత్రికుల్ని అవమానించిన మీ అహంకారాన్ని బట్టి ఎందుకు మిమ్మల్ని ప్రాసిక్యూట్ చేయరాదో వివరిస్తూ సంజాయిషీ కోరుతున్నాం..."

ఆ తరువాత ఏం రాశారో చదవలేకపోయా డతను. అప్పటికే అతని కళ్ళు బైర్లుకమ్మాయి.

లక్నో కోర్టుల చుట్టూ తిరగటం, విచారణ, కోర్టు జరిమానా, తను మామగారి చెవులు పిండి తీసుకున్న కట్నం జరిమానాగా కట్టటం వంటి బీభత్స దృశ్యాలు కళ్ళముందు కలర్ రీళ్ళలా తిరిగి కళ్ళు తిరిగాయి.

సదరు ప్రభుత్వం వారి 'విదేశీ టూరిస్టు భక్తి'కి నవ్వాలో, ఏడవ్వాలో తెలియని తికమకతో "దేశభక్తి జిందాబాద్ !" అని అరుస్తూ వాలుకుర్చీలో నీరసంగా కూలబడ్డాడు సుబ్బారావు.

వాకిట్లో రెండో బట్వాడా ఉత్తరా లిచ్చే పోస్ట్‌మేన్ "పోస్ట్ ! పోస్ట్ !" అని అరుస్తున్నాడు.

సుబ్బారావు అవేం పట్టించుకునే స్థితిలో లేడు.

★

